క్లుప్తంగా

సంతాప తీర్మానంతో కౌన్సిల్ సమావేశం వాయిదా


మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ సాధారణ సమావేశంలో ఇటీవల మృతి చెందిన మాజీ కౌన్సిలర్లు మోదుగుమూడి శేషుబాబు, ఆకునూరి నారాయణరావులకు సభ్యులు నివాళులర్పించారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు శేషుబాబు, నారాయణరావులకు మేయర్ వెంకటేశ్వరమ్మ నివాళులర్పించి వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం డెప్యూటీ మేయర్ శీలం భారతి, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, పరింకాయల విజయ్, షేక్ షాహెనా, మాచవరపు రాంప్రసాద్, చిత్తజల్లు నాగరాము, దింటకుర్తి సుధాకర్ తదితరులు మృతి చెందిన శేషుబాబు, నారాయణరావులకు నివాళులర్పించి, వారితో ఉన్న అనుబంధాన్ని వివరించారు. అనంతరం సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు మేయర్ వెంకటేశ్వరమ్మ ప్రకటించారు.

బాబా ఆశ్రమాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

నంగేగడ్డ(నాగాయలంక): గ్రామంలోని శ్రీఅమ్ముల షిర్డీ సాయిబాబా సేవాశ్రమాన్ని అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్, ఆయన తనయుడు వెంకట్రామ్ (రాజా) శనివారం సందర్శించారు. తొలుత ఆశ్రమ వ్యవస్థాపకులు అమ్ముల సాంబశివరావు ఆశీస్సులు పొందారు. ఈసందర్భంగా గురూజీకి పట్టు వస్త్రాలు సమర్పించి సత్కరించారు. బాబా వారికి పూజలు జరిపిన మీదట ఆశ్రమ ప్రాంగణంలో గత ఏప్రిల్‌లో ఆవిష్కరించిన 91 అడుగుల సాయిబాబా విగ్రహాన్ని తిలకించి, నిర్మాణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ ప్రతినిధులు, శిష్య బృందం సభ్యులు ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేశారు.

బుక్ కీపర్లకు శిక్షణ

నాగాయలంక: స్థానిక దివిసీమ మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం వెలుగు ఏపీఎం కె.వై.దాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రకృతి వ్యవసాయంపై వెలుగు బుక్ కీపర్లకు శిక్షణ నిర్వహించారు. శిక్షణ రిసోర్స్ పర్సన్‌గా హాజరైన అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.జోత్స్న మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం విధానంలో విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేస్తే తెగుళ్ల నుంచి పంట రక్షణ పొందుతారన్నారు. ఘన, ద్రవ జీవామృతాలు వాడటంతో మొక్కలకు పోషకాలు అందుతాయని, చీడపీడల నివారణకు నీమ, అగ్ని అస్త్రములు ఉపయోగించి పంటలను రక్షించుకోవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యోగి కె.బుజ్జిమ్మ, వెలుగు సీసీలు, వీఓఎలు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ బహూకరణ

మోపిదేవి: మండల వెటర్నరీ వైద్యశాలకు స్థానిక పాలకేంద్రం అధ్యక్షుడు బొందలపాటి ప్రసాద్ 500 లీటర్ల సామర్థ్యంగల వాటర్ ట్యాంకును శనివారం వితరణగా డాక్టర్ నందకిషోర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ నీటి సరఫరాకు విద్యుత్ మోటార్‌ను అందిస్తానని హామీ ఇచ్చారు. పంచాయతీ కింద బోరుపంపులు వేయిస్తామని సర్పంచి నందిగం మేరీరాణి తెలిపారు. ఈ కార్యక్రజుమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నాదెళ్ల శరత్చంద్ర బాబు, గద్దె శ్రీహరి, వెటర్నరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై 'మీకోసం'లో ఫిర్యాదు చేయండి

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను 'మీకోసం' విభాగంలో ఫిర్యాదు చేయాలని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు. తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రెయిన్లలో పూడికతీత, వీధి దీపాల సమస్యలను, రోడ్లపై ఆక్రమణ వంటి విషయాలను నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'మీకోసం' విభాగానికి ఫోన్, లేదా స్వయంగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. 98499 07989, 08672-227700 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. పండుగ రోజులు, సెలవు దినాల్లో కూడా 'మీకోసం' లో ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

భోజన పథకం పరిశీలన

గోగినేనిపాలెం(ఘంటసాల): మండలంలోని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. మెనూ అమలు తీరు, వంట చేసే విధానం, ఎంత మంది విద్యార్థులు, తదితర విషయాలను వంట ఏజెన్సీ వారిని అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో హెచ్ఎం వేణుగోపాలరావు, కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు సునీత, కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

పెడన: పట్టణంలోని రెండు రేషన్ దుకాణాలను పీడీఎస్ డీటీ ఇన్‌చార్జి, పెడన డెప్యూటీ తహసీల్దారు కె.పూర్ణచంద్రరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక వీఆర్వోలతో కలిసి ఆయన పట్టణంలోని 1, 2వ దుకాణాలను పరిశీలించారు. 14వ వార్డు మఠంవీధిలోని ఒకటో దుకాణం, 15వ వార్డులోని పోస్టాఫీసు సమీపంలోని 2వ దుకాణంలో స్టాకును, స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. వీఆర్వోలు షాఫీరుల్లా, శ్రీనివాస్ ఉన్నారు. డీటీ మాట్లాడుతూ జేసీ ఆదేశాల మేరకు తనిఖీలను చేపట్టామన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి


బాబూజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన కృషి మరువలేనిదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు జగ్జీవన్‌రామ్ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కిట్టు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ అట్టడుగు వర్గాలు కూడా విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చాటి చెప్పిన మహానుభావుడు జగ్జీవన్‌రామ్ అన్నారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ అని అన్నారు. డిప్యూటీ మేయర్‌లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, పార్టీ కన్వీనర్‌లు చిటికిన నాగేశ్వరరావు, గూడవల్లి నాగరాజు, కార్పొరేటర్‌లు పర్ణం సతీష్, పటమట రమేష్, కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, జోగి చిరంజీవి, తిరుమలశెట్టి ప్రసాద్, దళిత సంఘ నాయకులు జక్కుల ఆనంద్‌బాబు, బూరగ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: దివంగత ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి పలుచోట్ల నిర్వహించారు. స్థానిక 8వ వార్డు వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జనసేన యువ నేత మండలి వెంకట్రామ్ (రాజా) పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మహనీయుడు అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని పరి పూర్ణంగా అమలు చేసిన మహోన్నత నాయకుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. గాంధీక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు టీడీపీ, జనసేన నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.


అవనిగడ్డలో జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో:

స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన జగ్జీవన్‌రామ్ ఎన్నో సంక్షేమ పథకాలు, సంస్కరణలు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘంటసాల: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ నేటి యువతకు ఆదర్శమని వైఎస్సార్ సీపీ సేవాదళ్ ఘంటసాల మండల అధ్యక్షుడు దిరిశం పిచ్చేశ్వరరావు అన్నారు. ఘంటసాల పెద్దగూడెంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఎంపీటీసీ దిరిశం వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి రిటైర్డ్ తహసీల్దార్ పాల సోమేశ్వరరావు, దొండపాటి యాకోబు, జువ్వనపూడి యేసుపాదం, కొల్లూరి సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ సాంస్కృతిక శాఖ రాష్ట్ర జనరల్ సెక్రటరీ దిరిశం బాలకోటయ్య, నందేటి శ్రీనివాసరావు, దిరిశం నవీన్, నడకుదురు రాజీవ్, దిరిశం శ్రీను, దొండపాటి కోటయ్య, చొప్పర పెద నాంచారయ్య, దేవరపల్లి వెంకయ్య, శీలి ఏలియా, దేవరపల్లి వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెదప్రోలు(మోపిదేవి): బలహీన వర్గాలకు రాజ్యాంగఫలాలు అందించిన గొప్ప రాజనీతి యోధుడు మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అని గ్రామ సర్పంచి పాలిమెట్ల ఏసుబాబు అన్నారు. మండలంలోని పెదప్రోలు గ్రామంలో బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి శనివారం పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నాదెళ్ల శరత్చంద్రబాబు, కొల్లూరు వెంకటేశ్వరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దగూడెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పిచ్చేశ్వరరావు, గ్రామస్తులు


పెదప్రోలులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఏసుబాబు

తెలుగురావుపాలెం(ఘంటసాల): మండలంలోని తెలుగురావుపాలెం గ్రామ సచివాలయంలో మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సర్పంచ్ ప్రసాద్ బాబుతో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ ఆరుంబాక రవి, వార్డు సభ్యులు తలకటూరి శ్రీకాంత్, సొసైటీ సభ్యులు పెదముత్తేవి వసంతరావు, పంచాయతీ కార్యదర్శి బి.అశ్విన్ కుమార్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయ న్యాయ సంహిత చట్టాలపై అవగాహన



బంటుమిల్లి: కేంద్ర ప్రభుత్వం మార్చిన నూతన చట్టాలపై మహిళలకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన ఉండాలని వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి.అర్పిష్మ అన్నారు. శనివారం సీడీపీఓ ఎం.సముద్రవేణి అధ్యక్షతన మిషన్ శక్తి స్కీం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 100 రోజుల ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టంలోని విషయాలపై అవగాహన కల్పించారు. మిషన్ వాత్సల్య స్కీంలో బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, బాలల లైంగిక వేధింపులు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లాంటి అంశాలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పర్యవేక్షించాల్సి ఉందన్నారు. గ్రామ స్థాయిలో విషయ సమాచారం సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళితే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని సూచించారు. నూతన చట్టాలు మహిళలకు, బాలలకు పూర్తి రక్షణ ఇస్తాయని, చట్టాలు అతిక్రమించిన వారికి శిక్షలు కఠినంగా రూపొందించారని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు, బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన మండలాల్లోని పలు గ్రామాల అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాంటీ రేబిస్ టీకాలు వేయించండి

మచిలీపట్నంటౌన్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రైతుబజారు పక్కనున్న పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలు, పిల్లులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేశారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కుక్కలు, పిల్లులు పెంపకందారులు వాటిని తీసుకువచ్చి వ్యాక్సిన్ వేయించారు. దాదాపు 424 జీవాలకు వ్యాక్సిన్ వేసినట్లు వైద్యులు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, 45వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ పీవీ ఫణికుమార్, పశుసంవర్ధకశాఖ డీడీ ఎస్. నాగభూషణం, పశువైద్యుడు జేవీ రమణయ్యానాయుడు ఉన్నారు.

ఘంటసాల: పెంపుడు కుక్కలు ఉన్న ప్రతి ఒక్కరూ వాటికి యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ అన్నారు. స్థానిక పశు వైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల పరిధిలోని పెంపుడు కుక్కలకు ప్రభుత్వం ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి డాక్టర్ పిన్నమనేని మనోజ్‌తో కలసి సర్పంచ్ వెంకటేశ్వరమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పెంపుడు కుక్కల వల్ల ఇంటిలోని వారికి ఎలాంటి వ్యాధులు సక్రమించకుండా ఉండేందుకు పశు వైద్యాధికారుల సూచనలు మేరకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. డాక్టర్ పిన్నమనేని మనోజ్ మాట్లాడుతూ చాలా మంది పెంపుడు కుక్కలతో చాలా సన్నిహితంగా ఉంటారు. వాటి నుంచి వ్యాధులు సక్రమించకుండా ఉండాలంటే సకాలంలో టీకాలు వేయించడం, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఏటా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని డాక్టర్ మనోజ్ తెలిపారు. అనంతరం పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు పి.యోహాను, వై.శ్రీకాంత్, రైతు కె.శ్రీనివాసరావు, వీఏ ఆర్.మురళీ కృష్ణ, ఏహెచ్ఏలు పి.గోపి బాబు, ఎస్కే ఫయాజ్ అహ్మద్, ఓఎస్‌టీ టి.దీపక్, కుక్కల యజమానులు పాల్గొన్నారు.


మచిలీపట్నం పశువైద్యశాలలో..

భావదేవరపల్లి(నాగాయలంక): ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని మండలంలో శనివారం వందకు పైగా పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేశారు. తొలుత భావదేవరపల్లి గ్రామీణ పశు వైద్యశాలలో జరిగిన కార్యక్రమాన్ని మండల పశు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్.సాయి మౌనిక ప్రారంభించారు. నాగాయలంక ప్రభుత్వ పశువైద్యశాల, తలగడదీవి, సంగమేశ్వరం, ఎదురుమొండి గ్రామీణ పశుగణాభివృద్ధి కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉచిత టీకాల కార్యక్రమాలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 200 గేదెలకు గురక వ్యాధి నివారణ టీకాలు వేశామని డాక్టర్ మౌనిక చెప్పారు. రెండు మూడు రోజుల్లో తెల్లపశువుల్లో వస్తున్న ముద్ద చర్మవ్యాధి నివారణకు సంబంధిత టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేశామని ఆమె వెల్లడించారు. ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, భావదేవరపల్లి ఉప సర్పంచి నల్లూరి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి మల్లికార్జునరావు, వెటనరీ సిబ్బంది పాల్గొన్నారు.


మోపిదేవిలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ నందకిషోర్

కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ తప్పని సరి

మోపిదేవి: పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని వెటర్నరీ వైద్యులు డాక్టర్ నందకిషోర్ తెలిపారు. మోపిదేవిలో శనివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధిని నిరోధించేందుకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వాలన్నారు. ఈ వ్యాక్సిన్ వేయకుంటే కుక్కకాటుకు గురైన మనుషులకు కూడా కుక్క లక్షణాలు వచ్చి మరణించే అవకాశం ఉందన్నారు. జెడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు, గ్రామ ఉప సర్పంచ్ కోనేరు సుందర్ సింగ్, మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, పాలకేంద్రం అధ్యక్షుడు బొందలపాటి ప్రసాద్, గద్దె శ్రీహరి, వెటర్నరీ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.


పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ బాబురావు

326 పెంపుడు జంతువులకు..

పెడన: పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తగా ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకా వేసినట్లు పెడన పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కొనకళ్ల బాబూరావు అన్నారు. శనివారం పెడన నియోజకవర్గ వ్యాప్తంగా పశువుల ఆసుపత్రులలో 326 పెంపుడు జంతువులకు ఈ వ్యాక్సిన్ వేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పెంపుడు కుక్కలు, పిల్లులకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేశామన్నారు. ప్రతి సంవత్సరం యాంటీ రేబిస్ టీకాలను తప్పనిసరిగా వేయించాలని ఆయన తెలిపారు. పెడనలో 105, గూడూరులో 97, బంటుమిల్లిలో 95, కృత్తివెన్నులో 29 పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేసినట్లు వివరించారు.


బంటుమిల్లి పశువైద్యశాలలో వ్యాక్సిన్ వేస్తున్న డాక్టరు స్ఫూర్తి


భావదేవరపల్లిలో కుక్కలకు టీకా వేస్తున్న డాక్టర్ మౌనిక

124 కుక్కలకు టీకాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని బంటుమిల్లి, పెద తుమ్మిడి, అర్తమూరు గ్రామాల్లోని పశువైద్యశాలల్లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల్లో 124 కుక్కలకు వ్యాక్సిన్ల (టీకాలు) వేసినట్లు వైద్యాధికారి స్ఫూర్తి తెలిపారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పెంపుడు కుక్కలకు యాంటి రేబిస్ వ్యాక్సిన్లు వేశామన్నారు. పశువైద్యులు ఎల్.రాజీవ్‌నాయక్, ఎస్.సుష్మంత్, వెటర్నరీ అసిస్టెంట్లు రాజీవ్, ప్రసాద్, త్రినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్పీ నేత హంతకులను అరెస్ట్ చేయాలి


బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు

కొడాలి(ఘంటసాల): రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న తమిళనాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్ స్ట్రాంగ్ దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఎస్పీ అవనిగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జి, కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని కొడాలి గ్రామంలో ఉన్న బీఎస్పీ కార్యాలయంలో నాగేశ్వరరావు విలేకర్లతో మాట్లాడారు. ఆర్మ్ స్ట్రాంగ్‌ను హత్య చేసిన నిందితులు ఫుడ్ డెలివరీ ఏజెంట్ల మాదిరిగా వచ్చి ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులు చెబుతున్నప్పటికీ ఇది కేవలం రాజకీయ హత్యగానే భావిస్తున్నామన్నారు. రాజకీయంగా పోటీ ఉండాలే తప్ప ఇలాంటి హత్యా రాజకీయాలు ఉండకూడదన్నారు. హత్యకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ హత్యపై నేర విచారణ చేసి నిందితులను పట్టుకోకపోతే పార్టీ అధినేతలతో మాట్లాడి బీఎస్పీ తరుపున జిల్లాలో కార్యచరణ ప్రకటిస్తామన్నారు. ఇలాంటి చర్యల వల్ల రాజకీయాల మీద రాబోయే తరాల వారికి అసహ్యం వేస్తుందని, ఇలాంటి చర్యలు ఇకపై జరగకుండా అన్ని ప్రభుత్వాలు సత్వర చర్యలు తీసుకోవాలని నాగేశ్వరరావు కోరారు. తమిళనాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు పార్టీ తరుపున, వ్యక్తిగతంగా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పనిచేసే వారిని ప్రోత్సహించండి

పెడన: పట్టణాభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని, నిబంధనలకు విరుద్ధంగా, బాధ్యతారాహిత్యంగా పనిచేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం ఆయన పెడన వ్యవసాయమార్కెట్ యార్డులోని కమిటీ సమావేశం హాలులో పెడన పురపాలక సంఘ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య పురపాలక సంఘంలో ఆదాయం రాబడి, ఖర్చులు, 2019 నుంచి 2024 వరకు వచ్చిన వివిధ నిధులు గురించి వివరించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అబ్దుల్‌ఖయ్యూం(హన్ను), ఏఈ సీతారామంజనేయులు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు రెహమాన్ బేగ్, యక్కల శామలయ్య, 12వ వార్డు కౌన్సిలర్ శివపావని, టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిది

పెడన: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం సెయింట్ విన్సెంట్ పల్లోటి హైస్కూలులో పర్యావరణ సంరక్షణ, పాఠశాల విద్యార్థి నాయకత్వ ఎంపిక మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాగిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ యాకోబు, డీన్ రాజీవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వారాహి నవరాత్రులు ఆరంభం

నాగాయలంక: స్థానిక కృష్ణా నదీ తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం దేవాలయాల సముదాయంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శనివారం శ్రీవారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ఆరంభం అయ్యాయి. తొలుత వేకువ జామునే వారాహి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి శాస్త్రోక్త పూజలతో కనకదుర్గమ్మ ఎదుట ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీఠంపై ప్రతిష్టించారు. ఈ ప్రాంతంలో ప్రప్రథమంగా చేపట్టిన ఆషాఢ వారాహి నవరాత్రులలో భాగంగా వారాహి సంప్రదాయ రీతిలో నియమ బద్ధంగా పూజలు జరిపేందుకు సంకల్పించినట్లు ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, అచ్యుత శేఖరశర్మ భక్తులకు వివరించారు. తొలిరోజు అమ్మవారిని ఉన్మత్త వారాహి (ఇంద్రాణిదేవి)భావనతో చేపట్టిన పూజలకు క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, సుజనకుమారి దంపతులు శ్రీకారం చుట్టారు. అర్చకుల నేతృత్వంలో వారాహి అమ్మవారి ఉత్సవమూర్తికి పసుపు, కుంకుమలతో పలు జంటలు తొలుత అభిషేకాలు జరిపి తదుపరి విశేష అలంకారం చేశారు. ఉప్పల లీలాకృష్ణప్రసాద్ (బుజ్జి)-పూర్ణిమ, బోయపాటి రాము-సరిత, చండూరు రుషి-శోభాదేవి, ఉప్పల రాజు-అరుణ, తలశిల జగదీష్-తేజ, చిట్టా సత్యనారాయణమూర్తి-పద్మజ జంటలు పూజా కార్యక్రమాలు జరిపారు. పూజలు, విశేష అలంకారం తదుపరి మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కమిటీ పెద్దలు, గ్రామస్తులు పర్యవేక్షించారు.


శ్రీకనకదుర్గాదేవి సన్నిధిలో పీఠంపైకి వారాహి మాతను చేరుస్తున్న దంపతులు

కె.కొత్తపాలెం (మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెం గ్రామంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు విద్యాసాగర్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


కె.కొత్తపాలెంలో దుర్గానాగేశ్వరస్వామి హారతి అందుకుంటున్న భక్తులు

హెల్మెట్‌ల వాడకం తప్పనిసరి

కోనేరుసెంటర్: వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని బందరు ట్రాఫిక్ సీఐ వైవీ రమణ తెలిపారు. శనివారం బందరు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులకు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాల మేరకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ వాడకం వలన అనేక ఉపయోగాలు ఉంటాయన్నారు. ప్రయాణాల్లో అనుకోని విధంగా ప్రమాదాలు సంభవించినపుడు హెల్మెట్ లేక అనేక మంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. యువత వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. డ్రైవింగ్‌పై సరైన అవగాహన ఉండాలన్నారు. కొద్దిపాటి నిర్లక్ష్యం నిండు ప్రాణాలను హరిస్తుందన్నారు. వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్‌లు ధరించకుండా పట్టుబడితే కేసులు నమోదు చేయటంతో పాటు భారీ జరిమానా విధించటం జరుగుతుందని హెచ్చరించారు.

11న మండల సర్వసభ్య సమావేశం

కోడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 11న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అన్ని శాఖలాధికారులు విధిగా హాజరు కావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఈ సమావేశంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాని కోరారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి


వెంకటేశ్వరరావు మృతదేహం

దాలిపర్రు(ఘంటసాల): మండలంలోని దాలిపర్రు పంచాయతీలో కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్ శనివారం సాయంత్రం మృతి చెందాడు. సేకరించిన వివరాల మేరకు..దాలిపర్రు గ్రామానికి చెందిన చొప్పర వెంకటేశ్వరరావు (53) గ్రామ పంచాయతీలో వీధిలైట్లు వేసేందుకు 25 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం వీధిలైట్లు వేసేందుకు స్తంభం ఎక్కాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడి నుంచి కింద పడిపోయాడు. వెంటనే సహాయకులు, స్థానికులు చల్లపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా అక్కడ పరీక్షించిన వైద్యులు వెంకటేశ్వరరావు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు వెంకటేశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘంటసాల పెద్దగూడెం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు కొన్ని సంవత్సరాల క్రితం దాలిపర్రు గ్రామంలో స్థిరపడ్డాడు. విషయం తెలుసుకున్న ఇరు గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకుని విచారం వ్యక్తం చేశారు.